ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 24 ఆగస్టు 2025 | 3



భలే మ్యాజిక్ : పెద్దాపురం కుమ్మరివీధిలో నీరు భూమిలో ఇంకిపోయేలా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌లో నీరు పోయించి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

గోదారోళ్లు మనసున్న వ్యక్తులు..

అందరి కంటే మంచి మనసున్న వ్యక్తులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నారు. గోదావరి జిల్లా వాసుల మాట సౌమ్యంగా ఉంటుంది. ఇటువంటి ఈ జిల్లాలోనే గత పాలనలో రౌడీయిజం పెరిగిపోయింది.. హత్యలు చేసే వారిని తూర్పుగోదావరి జిల్లాలోకి రానివ్వరు. కానీ గత వైసీపీ ఎన్నో అరాచకాలు చేసింది. అందుకే గోదావరి జిల్లాల వాళ్లు ఆ పార్టీనే దూరం పెట్టారు. కానీ ఇప్పుడు మేం వీటన్నింటిని సరిచేస్తున్నామన్నారు. పెద్దాపురంలో రూ.330 కోట్లతో చెత్త నుంచి విద్యుదుత్పత్తి తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రెండేళ్లలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ 18 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించానని తెలిపారు. గోదావరి వరదలకు కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు ముంపునకు గురైతే ఎప్పటికప్పుడు అందరిని అలెర్ట్ చేసి ప్రజలకు అండగా నిలిచామన్నారు. పెద్దాపురంలో రూ.38 కోట్లు, సామర్లకోటలో రూ.39కోట్ల అమృత్ నిధులతో ఇంటింటికి కుళాయి పథకాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.సామర్లకోటలో డిగ్రీ కళాశాల,పెద్దాపురంలో ప్రభుత్వాసుపత్రి ఇలా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప ఏది అడిగినా చేస్తాం.అడిగిన దాని కంటే ఎక్కువ చేస్తానన్నారు.



మీ ప్రాజెక్ట్ సూపర్



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన తొమ్మిది స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రీసైక్లింగ్‌లో భాగంగా చేపడుతున్న ఉత్పత్తులపై ఆరా తీశారు. డ్రైవేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్, మెటల్ వేస్ట్‌గా చెత్తను వేరుచేసేలా ప్రాజెక్ట్ రూపొం దించిన తొమ్మిదో తరగతి విద్యార్థులను మెచ్చుకున్నారు. సముద్రపు నాచుతో బయోడీజిల్,కాస్మెటిక్స్ వంటి ఉత్పత్తులు తయారు చేస్తున్న నిర్వాహకులతో ముచ్చటించారు. సముద్రపు నాచుతో మహిళలకు ఉపాధి కల్పించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు సీఎం తెలి పారు. శ్రీకాకుళం జిల్లాలో సము ద్రపు నాచుతో ఉత్పత్తులపై శిక్షణ పొందిన మహిళలతో వర్చువల్‌గా మాట్లాడారు.

మొబైల్ మార్ట్.. సూపర్





సీఎంకు ఆహ్వానం పలుకుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్

జనచంద్రం : ప్రజా వేదిక సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



స్వర్ణాంధ్ర చేస్తా!

పెద్దాపురంలో సీఎం చంద్రబాబు

- స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు
- బంగారు కుటుంబాలు పెరగాలి
- పారిశ్రామికవేత్తలకు పలు కుటుంబాలు దత్తత

(కాకినాడ,పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర నా లక్ష్యం.. ఆ దిశగానే అడుగులు వేస్తున్నా.. పెద్ద పెద్ద ప్రారంభోత్సవాలు.. కార్యక్రమాల కోసం తాను పెద్దాపురానికి రాలేదని..ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పడానికి వచ్చానని..ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలన్నదే తన సంకల్పం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం సీఎం పర్య టించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది.. అప్పుడే ప్రతి కుటుంబం ఆనందంగా ఉంటుందని.. దీనిలో భాగంగానే ఏడు నెలలుగా ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు వస్తాయని సీఎం వివరించారు. అక్టోబర్ 2వ తేదీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా చెత్త ఉండకూడదని ఆదేశించారు. డ్రోన్లు ఉపయోగించి దోమ ల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వ అలక్ష్యంతో అంటువ్యాధులు ప్రబలాయన్నారు. పేదవారు ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభు త్వం ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులను పీపీపీ పద్ధతిలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నా లక్ష్యం స్వర్ణ ఆంధ్ర కావాలంటే భవిష్యత్తులో ఏ పార్టీ వైపు చూడకుండా ఎన్డీఏ వైపు ప్రజలంతా ఉండాలని పిలుపునిచ్చారు.



పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ బీవీ.కృష్ణారావుకు బంగారు కుటుంబాన్ని దత్తత ఇస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

బంగారు కుటుంబాలతో మాటామంతీ..



పాత పెద్దాపురం, సామర్లకోటకు చెందిన నందిక మార్త, యండమూరి ఏసమ్మ, రాజారపు వీరలక్ష్మి, కడగాల గౌరి, కోసి ఉదయకుమారి, పలివెల లక్ష్మి, మాల్లాడి రాజేశ్వరి, మాటం సత్యవేణి, సరుకుల శ్రీదేవి, ఇజ్జిన స్వాతి కుటుం బాలతో చంద్రబాబు ముచ్చటిం చారు.ఇబ్బందులు తెలుసు కున్నారు. వీరిని దత్తత తీసుకున్న మార్గదర్శులైన లలిత ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్,పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ఎండీ బీవీ.కృష్ణారావు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్,నున్న రామకృష్ణ, కొడవడి గాంధీ, అపర్ణ టైల్స్ హెచ్‌ఆర్ అజయ్‌కుమార్, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఎండీ వల్లూరి సూర్యప్రకాశరావు,దేవి సీఫుడ్స్ బ్రహ్మానందం, బ్లూ ఓషన్స్ ఎండీ రవికాంత్ తదితరులను సీఎం సత్కరించారు.

నా పేరు.. పవన్ పేరు చెప్పి బస్సెక్కండి!




టీడీపీ సూపర్‌సిక్స్ అంటే సాధ్యం కాదని చాలామంది అన్నారు.. కానీ ఇప్పుడు అమలు చేసి చూపెట్టాం. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం అద్భుతంగా విజయవంతమైంది.. కాకినాడ, రాజమండ్రి వెళ్లాలంటే బస్సెక్కి తన పేరు..పవన్ పేరు చెప్పి జల్సాగా వెళ్లిపోవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. అమ్మగారింటికి వెళ్లాలన్నా, తల్లిని పలకరించేందుకు వెళ్లడానికి ఇక ఇబ్బందే లేదని చమత్కరించారు.



మీ సేవలు భేష్ : పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందజేత

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ఉదయం 11.55 గంటలకు హెలికాప్టర్ దిగిన చంద్రబాబు తొలుత పెద్దాపురం పదో వార్డులో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు.ఆ తర్వాత పావు కిలోమీటరు మేర వైద్యులు, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీ చేశారు. అనంతరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో కలిసి బస్సులో 1.20 గంటలకు ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. పెద్దాపురం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వీరి కోసం యాక్సిస్ బ్యాంకు ద్వారా బీమా పథకాన్ని ప్రారంభించారు. పెద్దాపురం మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వై.వీరవెంకట సత్యనారాయణ, ముత్య దుర్గను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు. అలాగే యాక్సిస్ బ్యాంక్ ద్వారా ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. సాయంత్రం 5.22 గంటలకు అమరావతికి తిరుగుపయనమయ్యారు.



మీ కుటుంబాలకు నేనున్నా..

పెద్దాపురం పట్టణంలో సీఎంతో తన కుటుంబానికి సెల్ఫీ తీస్తున్న యువతి









పి గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో కాజ్‌వే వద్ద జనం కష్టాలు

నిలకడగా గోదావరి వరద

- తేరుకుంటున్న గ్రామాలు
- కోనసీమ జిల్లాలో 4527 మంది నిరాశ్రయులు
- కలెక్టర్ మహేష్‌కుమార్

5



చిందాడగరువు సొసైటీని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, డీఆర్వో మాధవి, సొసైటీ అధ్యక్షుడు మహాలక్ష్మి ప్రభాకర్

చిందాడగరువు సొసైటీని ఆదర్శంగా తీసుకోవాలి

కలెక్టర్ మహేష్‌కుమార్ సూచన


అమలాపురం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తున్న వ్యాపార లావాదేవీలతోపాటు డిపాజిట్లర్లకు నమ్మకం కలిగించేలా సొసైటీ పాలకవర్గాలు పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు సొసైటీని కలెక్టర్ మహేష్‌కుమార్, డీఆర్వో మాధవితో కలిసి వెళ్లి సొసైటీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సొసైటీ అధ్యక్షుడు, అమలాపురం లోక్‌సభ టీడీపీ రైతు సంఘ అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్ దుశ్శాలువా, పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఆ తరువాత సొసైటీ కార్యకలపాల నిర్వహణపై ప్రభాకర్ కలెక్టర్‌కు వివరించారు. ఎరువులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్టాకు వివరాలు డిపాజిట్ల స్వీకరణ, నిర్వహణ, వడ్డీ రేట్లపై కలెక్టర్‌కు వివరించారు. అలాగే సొసైటీ పరిధిలో ఉన్న రైతులతో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో కలిసి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి ప్రతి రోజు సొసైటీ ద్వారా జరుగుతున్న కార్యకలపాలు, ఎరువుల నిల్వలు వంటి సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్టు కలెక్టర్‌కు వివరించారు. దాంతో సొసైటీ అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మిప్రభాకర్ ఈ సొసైటీకి ఆదర్శంగా నిర్వహిస్తున్నారని, ఇదే తరహాలో జిల్లాలో అన్ని సొసైటీల్లో ఈ తరహా పద్ధతులు అమలయ్యేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ డీఎస్‌వోను ఆదేశించారు. సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించి సొసైటీ పాలక వర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు.

వచ్చేశాయ్ ఎగ్ కార్ట్‌లు!



అమలాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళల పంపిణీకి సిద్ధంగా ఉన్న ఎగ్ కార్ట్‌లు

- గుడ్లతో విభిన్న రుచులతో వంటకాలు
- డ్వాక్రా మహిళలకు ఉచితంగా ఎగ్‌కార్టులు
- జిల్లావ్యాప్తంగా 40 ఎగ్‌కార్టులు మంజూరు
- గ్రామీణ మహిళలకు ఉపాధే లక్ష్యం





అమలాపురం రూరల్/మండపేట,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గుడ్డు.. వెరీ గుడ్డు. నూరుశాతం కల్తీలేని అధిక పోషకాలు కలిగిన కోడిగడ్లు తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునంటూ నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) విస్తృత ప్రచారం చేపట్టింది. కోడిగుడ్ల వినియోగాన్ని పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంతోపాటు డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా రూ.50 వేలు విలువైన ఎగ్‌కార్ట్‌లను డ్వాక్రా మహిళలకు ఉచితంగా అందించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కోనసీమ జిల్లాకు 40 ఎగ్‌కార్ట్‌లను అందించేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా జిల్లాకు తొలివిడతలో ఎనిమిది ఎగ్ కార్ట్‌లు చేరుకున్నాయి. ఒక్కో యూనిట్ విలువ ఉండగా, దీనిలో రూ.35 వేలు యూనిట్‌కాగా, మరో రూ.15 వేల విలువైన వంట సామగ్రి అందించనున్నారు. ఈ యూనిట్ ద్వారా వ్యాపారం చేసే మహిళలు నెలకు రూ.20 వేల వరకు ఆదాయం పొందేలా ప్రభుత్వం రూపకల్పన చేసింది.

డ్వాక్రా మహిళల ఆదాయ మార్గం

డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎగ్ కార్ట్‌ల వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. కోడిగుడ్లు కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు. డ్వాక్రా మహిళలకు ఆదాయాన్ని తెచ్చిపెట్టగలవని చెబుతున్నారు. నిత్యం గుడ్ల వంటకాలతో పోషకాహారాన్ని అందిస్తూ మహిళలు రోజువారీ ఆదాయం పొందేందుకు ఎగ్‌కార్ట్‌లు దోహదపడతాయి. ఇటీవలకాలంలో పల్లె, పట్టణం అన్న బేధం లేకుండా ఎక్కడ చూసినా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లే. ఆయా సెంటర్లలో ఎగ్ ఫ్రైడ్‌రైస్, ఎగ్ నూడుల్స్, ఎగ్ బజ్జీ, ఆమ్లెట్లు వంటివి సర్వ సాధారణమైపోయాయి. దోసెలపై కోడిగుడ్లను ఆమ్లెట్‌గా వేయడం, పరోటా విత్ ఎగ్, ఎగ్65, గోంగూర విత్ ఎగ్ దోశ, ఎగ్ ఫ్రీరోస్ట్ వంటి అనేక రకాల వంటకాలు మార్కెట్‌లో జోరుగా అందుబాటులో ఉన్నాయి. ప్రతీరోజు విభిన్న రుచులతో గుడ్లు తినే అలవాటును ప్రోత్సహించడంతోపాటు అన్ని రకాల గుడ్డు వంటకాలను ఒకేచోట అందించడం ఎగ్‌కార్ట్‌ల లక్ష్యం.

ఎగ్‌కార్ట్ యూనిట్‌లో..

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే ఎగ్‌కార్ట్ యూనిట్‌లో వ్యాపారం నిర్వహించుకునేందుకు అవసరమైన సదుపాయాలు ఉంటాయి. స్టాల్‌తోపాటు గ్యాస్ పొయ్యి, పెనం, కలాయి, కొన్ని గిన్నెలు, టబ్‌లు, గ్లాస్‌లు, కంచాలతోపాటు ఆహార పదార్థాలను వేడివేడిగా అందించేందుకు హాట్ ప్యాక్‌లను కూడా ఉంచారు. ఫుడ్ ప్యాకింగ్ మిషన్ ఉండనే ఉంది. డ్వాక్రా మహిళలు వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేందుకు అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి వంటి పథకాల కింద డ్వాక్రా మహిళలకు అవసరమైతే రుణాలు అందిస్తామని డీఆర్డీఏ ఏపీడీ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాకు తొలి విడతలో ఎనిమిది ఎగ్ కార్ట్‌లు వచ్చాయని, నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందిస్తామన్నారు. మలివిడతలో మరో 32 వస్తాయని చెప్పారు. మహిళలను ఆర్థిక తోడ్పాటు, ఆరోగ్యవంతమైన సమాజానికి ఎగ్‌కార్ట్‌లు దోహదపడతాయని నాగేశ్వరరావు తెలిపారు. రోజూ రెండు కోడిగుడ్లు తినండి. రోగాలకు దూరంగా ఉండండి. గుప్పెడు గుడ్డు గుండెకు బలం అంటూ నెక్, సెర్ప్ ఏపీ ఆధ్వర్యంలో ఎగ్ కార్ట్‌లపై విస్తృత ప్రచారం ఆకట్టుకుంటోంది



గడియార స్తంభం సెంటర్‌లో విద్యార్థులతో కలిసి సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆనందరావు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుతో హర్షాతిరేకాలు

- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శన
- ఆలమూరు నుంచి అమలాపురం బదలాయింపు
- పేరూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు

అమలాపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కృతజ్ఞతా పూర్వక ర్యాలీ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్లతో ప్లకార్డులను చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చి మాట నిలుపుకున్నారని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ఆనందరావు ప్రకటించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, కర్రి రామస్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, యేడిద శ్రీను, మంతెన సురేష్‌రాజు, ఆర్డీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలమూరులో మూత..

ఒక వెలుగు వెలిగిన ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇక మూతబడింది. అదే కళాశాల పేరూరులో ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జిల్లా కేంద్రంగా ఉన్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి బదలాయింపుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిని అమలాపురం కళాశాలకు బదలాయించారు. కొత్త పోస్టులు ఏమీ మంజూరు చేయలేదు. ఇప్పటివరకు ఆలమూరులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలలో చేరేందుకు ఇంతవరకు ఏ ఒక్కరు ముందుకు రాలేదు. తృతీయ సంవత్సరం విద్యార్థులు చదువు ముగించుకుని వెళ్లిపోయారు. ఇక ద్వితీయ సంవత్సరంలో 8 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. వారిలో బీఏ కోర్సులో ఆరుగురు, బీకాంలో ఇద్దరు ఉండగా బీఎస్సీలో ఒక్కరు కూడా లేరు. ఆ ఎనిమిది మంది విద్యార్థులకు ఒక ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తోపాటు ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. మరో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆలమూరు నుంచి అమలాపురం బదలాయింపు చెందిన కళాశాలకు పదిమంది సిబ్బందికి అవకాశం ఉన్నందున ఖాళీ పోస్టులను భర్తీ చేయించుకోవాలి.

పేరూరులో కళాశాల ఏర్పాటుకు చర్యలు

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పేరూరులో ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఎంతోకాలంగా శ్రమిస్తున్నారు. పేరూరులోని దొమ్మేటి నర్సయ్యశెట్టి అండ్ దొమ్మేటి వెంకటరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఆనందరావు పరిశీలించారు. విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో నర్సయ్యశెట్టి, వెంకటరెడ్డి పాఠశాల ఏర్పాటుకు ఐదు ఎకరాలకు పైబడి స్థలం, పాఠశాల నిర్వహణకు 57 ఎకరాల అదనపు భూమిని అప్పట్లో దానం చేశారు. ప్రస్తుతం రెండు ఎకరాల విస్తీర్ణంలో జడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు, మూడెకరాల క్రీడా ప్రాంగణంలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలు చేపట్టేందుకు స్థల పరిశీలన చేశారు.



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

ఏపీ విధానాన్ని మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి

● ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విధానాన్ని దేశంలో మిగిలిన రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ప్రజావేదిక సభా ప్రాంగణంపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్‌కు చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్నారన్నారు. ప్రతీ శనివారం అధికారులు, పారిశుధ్య కార్మికులు ప్రతీ ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అలాగే చంద్రబాబు పేదరిక నిర్మూలనకు పీ4 అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చి ప్రతీ కుటుంబం బంగారు కుటుంబం కావాలన్నదే ఆయన సంకల్పం అన్నారు. పెద్దాపురంలో 2,500 కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. మార్గదర్శకులుగా పారిశ్రామికవేత్తల సహకారంతో పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు చెప్పారు. అలాగే పీ4 కార్యక్రమానికి సంబంధించి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గోదావరి, ఏలేరు జలాలు రెండు మున్సిపాలిటీలకు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. అది కూడా నెరవేరిందన్నారు. 100 పడకల ఆసుపత్రిని అడిగినట్టు చెప్పారు. మెట్ట గ్రామాలకు మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సామర్లకోటకు డిగ్రీ కళాశాలను కోరుతున్నట్టు చెప్పారు.

పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి

పెద్దాపురం నియోజకవర్గానికి ఏదడిగినా చేస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప 100 పడకల ఆసుపత్రి కావాలన్నారని, తప్పకుండా అది నెరవేరుతుందన్నారు. అలాగే సామర్లకోటలో డిగ్రీ కళాశాల, అమృత్ పథకం కింద నిధుల మంజూరు, 15 మెగావాట్ల సామర్థ్యంతో రూ.330 కోట్లతో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు, సామర్లకోటలో ఇంటింటికీ కొళాయికి రూ.75 కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు.

ప్రజల ఆలోచనా విధానంలో మార్పురావాలి : స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం చంద్రబాబు

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర కల సాకారం కావాలంటే ప్రజలు తమ ఆలోచనా విధానంలో మార్పు రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఆయన శనివారం పాల్గొన్నారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఆయన రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ పాల్గొన్నారు. ఈర్యాలీ సుమారు 100 మీటర్ల పైబడి సాగింది. స్థానిక మిరపకాయవీధి రామాలయం వరకూ సాగింది. దారిలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర గురించి అవగాహన ఎంతమేర ఉందనే కోణంలో కళాశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సర్కులర్ ఎకానమీపై పాలసీ చేశామని, వాటివల్ల ఉపయోగాలపై మెడికల్ కళాశాల విద్యార్థులకు వివరించారు. అంటువ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం చెత్తేనని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను వేశారన్నారు. దారిపొడవునా ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ అవసరమైన చర్యలను చేపట్టాలని అక్కడిక్కడే అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్త సేకరించే విధానం కోసం వారితో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వాహనాన్ని తోసి కార్మికులను ఉత్సాహపరిచారు. అలాగే తడిపొడి చెత్త సేకరణను పరిశీలించారు. ర్యాలీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్‌ను పరిశీలించిన సీఎం

స్థానిక కుమ్మరి వీధిలో 95 అడుగుల పొడవుతో రూ.1.5 లక్షల వ్యయంతో నిర్మించిన మ్యాజిక్ డ్రైన్‌ను చంద్రబాబు పరిశీలించారు. అలాగే వాటివల్ల కలిగే ఉపయోగాలు, వాటి నిర్మాణం, వీటి ద్వారా కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసు కున్నారు. మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణం ద్వారా జల వనరులను కలు షితం చేయకుండా భూమి లోనే ఇంకిపోయేలా ఈ విధానం







పెద్దాపురంలో పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పీ4 మార్గదర్శులు

బంగారు కుటుంబాలను సీఎం చంద్రబాబు సమక్షంలో దత్తత తీసుకుంటున్న లలితా ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్



పెద్దాపురంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం, వైద్య విద్యార్థినులు

అప్పుడు బాగుందా.. ఇప్పుడా..

స్వచ్ఛతా ర్యాలీలో డాక్టర్లు, వైద్య విద్యార్థులతో సీఎం ముచ్చట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

పెద్దాపురంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పురవీధుల్లో నడిచారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాలొన్న వైద్య విద్యార్థులు, డాక్టర్లతో ఆయన సరదాగా ముచ్చటించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న మార్పులను ఏం గమనించారు? అని అడిగి తెలుసుకున్నారు? సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకొచ్చామని చెబుతూ వాటి ఉపయోగాలను మెడికల్ విద్యార్థులకు వివరించారు. వారి మధ్య జరిగిన సంభాషణ వారి మాటల్లోనే..

సీఎం చంద్రబాబు: మీరంతా డాక్టర్సమ్మా? ఎక్కడ ఏ కాలేజ్ అమ్మా?

డాక్టర్: అవును సర్, రంగరాయ మెడికల్ కాలేజ్

సీఎం: సర్క్యులర్ ఎకానమీ స్టార్ట్ చేస్తున్నాం. వాట్ ఈజ్ యువర్ అండర్ స్టాండింగమ్మా?

డాక్టర్: హా.. ఈ వేస్ట్ అండ్ బయోమెడికల్. రీ సైక్లేషన్.. సర్..

సీఎం: ప్రతి ఒక్క దానికి వేస్ట్ నుంచి హౌ టు క్రియేట్ వెల్త్.. రీ సైక్లేషన్ అండ్ ఆల్ సో..

డాక్టర్: ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి.. సమ్ అదర్ బెటర్ థేన్ యుటిలైజ్ చేయడానికి, వాటర్, ఎయిర్ పొల్యూషన్‌ను తగ్గించవచ్చు సర్..

సీఎం: దీనికోసం సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకొచ్చాం. ఏదీ కూడా వేస్టు కాదు. వేస్టు నుంచి కంపోస్టు గానీ, లేకపోతే ఎనర్జీగానీ ఆర్ రీయూజ్డ్‌గానీ, మళ్లీ బ్యాక్ టు....

డాక్టర్స్ : ఎస్.. సర్..

సీఎం: ఎంతమంది అమ్మా? మీ కాలేజీలో స్టూడెంట్స్?

డాక్టర్: 200 మెంబర్స్ బ్యాచ్..

సీఎం: ఏ ఇయరమ్మా మీరు?

డాక్టర్: 2017 బ్యాచ్ సర్.. మెడికల్ ఆఫీసర్స్‌గా పనిచేస్తున్నాం.

సీఎం: స్టాండర్డ్స్ బాగానే ఉన్నాయా.. లేదా తగ్గాయా..

డాక్టర్: బాగున్నాయ్ సార్ స్టాండర్డ్స్..

సీఎం: పాతకాలేజ్.. రంగరాయ మెడికల్ కాలేజ్ అంటే ఒక బ్రాండ్..

డాక్టర్: అవును సర్

సీఎం: పాత గవర్నమెంట్ చూశారు. ఇప్పుడు ఈ గవర్నమెంట్ చూస్తున్నారు. మీరు ఏమన్నా ఒక మార్పు చూస్తున్నారా?

డాక్టర్: సిస్టమ్‌లో చాలా మార్పులు వచ్చాయి సర్.. బేసికల్లీ సొసైటీలో మాకు రెస్పెక్ట్ పెరిగింది సర్.. యాజ్ ఏ డాక్టర్‌గా.. ఈ సాసా ప్రోగ్రామ్ వల్ల, వీటివల్ల ఏమవుతుందంటే.. పొల్యూషన్ లేకుండా ఎన్విరాన్‌మెంటల్ వెదర్ బోర్న్ డిసీజెస్ మలేరియా, డెంగీ కంట్రోల్ అయ్యాయి సర్..

సీఎం: మీకు విజిబుల్ కనిపిస్తోందమ్మా అది?

డాక్టర్: హాస్పిటల్స్ పీహెచ్‌సీలకు వచ్చే పేషంట్స్ బట్టి తెలుస్తుంది సర్..

సీఎం: కమ్యూనికల్ డిసీజెస్ కొంతవరకు ఏమైనా కంట్రోల్ అయ్యాయా?

డాక్టర్: ఎస్ సర్..

సీఎం: వాటర్ బోర్న్‌గానీ, వెదర్ బోర్న్‌గానీ కంట్రోల్ అవుతున్నాయా?

డాక్టర్: కంట్రోల్ అవుతున్నాయ్ సర్. ఇప్పటివరకు మా పీహెచ్‌సీలో మేము క్లీన్‌లీనెస్ అనేది చేసుకుంటాం సర్.. దట్ ఈజ్ అవర్ ప్రోగ్రామ్ టు రెస్పెక్ట్.. ఈ ప్రోగ్రాం వల్ల అందరికీ అవేర్‌నెస్ తీసుకొస్తున్నాం సర్..

ప్రభుత్వ పథకాల అమలులో కార్యకర్తలు కీలకం

సీఎం చంద్రబాబు





సామర్లకోటలో కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

సామర్లకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పలు అబివృద్ధి పనులు, సంక్షేమం అమలులో పార్టీ కార్యకర్తలు కీలకం అయినందున అధికారులతోపాటు పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యకర్తలకు సూచించారు. శనివారం సాయంత్రం సామర్లకోట పూర్ణా కల్యాణ మండపంలో పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రతీ నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొని పారదర్శకత చూపాలన్నారు. ఈ-గవర్నెన్స్ క్వాంటమ్ మిషన్ వంటి పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కార్యకర్తలు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం పేదప్రజల జీవితాల్లో వికాసం తెస్తుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,500 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. మార్గదర్శకుల సహకారంతో ఆ కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ఎదుట భరోసా ఇచ్చారు. సీఎం అందించిన ప్రోత్సాహంతో ఇప్పటివరకూ రూ.వెయ్యి కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు నిర్వహించగలిగానని, అలాగే గత 14 నెలల కూటమి ప్రభుత్వ హయాంలో రూ. 100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే చినరాజప్ప సీఎం చంద్రబాబుకు తెలియజేశారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో మంచి ఫలితాలు : పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రతో మంచి ఫలితాల అందిస్తున్నట్టు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ అన్నారు. సీఎం సమక్షంలో ప్రజావేదికపై ఆయన శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంతో జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడచిన 8 నెలలుగా ప్రజా భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2024నాటికి రాష్ట్రంలో 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ చెత్త పేరుకుపోయిందని, దీన్ని వచ్చే అక్టోబరు 2 నాటికి పూర్తిగా తొలగించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోందని, సర్కులర్ ఎకానమీ ప్లాన్ కింద చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మెగా ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికే విశాఖ, గుంటూరు ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేయగా, పెద్దాపురంలో ఏర్పాటుచేస్తున్నామన్నారు.

ట్రిపుల్ ధమాకా

● డీఎస్సీ ఫలితాల్లో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధించిన మణికంఠ చంద్రశేఖర్ ● రంపయర్రంపాలెం యువకుడికి మూడు విభాగాల్లోను ర్యాంకులు ● జిల్లాస్థాయిలో టీజీటీలో 15వ ర్యాంకు



ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్

గోకవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్ శనివారం విడుదలైన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు అర్హత సాధించాడు. 2018లో జరిగిన డీఎస్సీలో మణికంఠ మొదటిసారి ప్రయత్నించి స్వల్ప తేడాతో అవకాశాన్ని కోల్పోవడం జరిగింది. కానీ పట్టువదలని విక్రమార్కుడిలా వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణపొంది 2025 డీఎస్సీలో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్‌అసిస్టెంట్ మూడు విభాగాల ఉపాధ్యాయ ఉద్యోగాలకు పరీక్ష రాశారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో జిల్లాస్థాయిలో టీజీటీలో 15వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్‌లో 23వ ర్యాంకు, ఎస్‌జీటీలో 59వ ర్యాంకు సాధించి మూడింటిలోనూ ఉద్యోగానికి అర్హత సాధించారు. స్కూల్‌అసిస్టెంట్‌గా జడ్పీ ఉన్నతపాఠశాల గణితశాస్త్రం ఉపాధ్యాయుడిగా చేరతానని మణికంఠ తెలిపాడు. మణికంఠ తండ్రి గోకవ రంలో టైలర్ వృత్తి చేస్తుంటాడు.

డీఎస్సీలో అనూష, నాగేశ్వరరావు, శ్రీనివాస్ ప్రతిభ





నాగేశ్వరరావుకు 9వ ర్యాంకు, అనూషకు 69వ ర్యాంకు

కపిలేశ్వరపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన పాలింగి అనూష ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 86.39 మార్కులు సాధించి జిలాల్లో 69వ ర్యాంకు, ఎస్సీ క్యాటగిరీలో 5వ ర్యాంకు సాధించింది. నిరుపేద కుటుంబమైన పాలింగి శ్రీనివాస్, బేబి దంపతుల రెండవ కుమార్తె అనూష. వివాహిత అయిన ఈమె అత్తవారిల్లు కందులపాలెం. భర్త ఫోటో గ్రాఫర్, ఈమె 1 నుంచి 5 వరకు వడ్లమూరు ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10వరకు కాలేరు ఉన్నత పాఠశాలలో చదివింది. ఇంటర్మీడియట్ రామచంద్రాపురంలోను, డీఎడ్ బొమ్మూరు డైట్‌లో చదివి ఈ ర్యాంకు సాధించింది. అలాగే మాచరమట్ల గ్రామానికి చెందిన పిల్లి నాగేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)లో జిలాల్లో 9వ ర్యాంకు సాధించాడు. తండ్రి సత్యనారాయణ, దంపతులు వ్యవసాయ కూలీలు కాగా ఆకుటుంబంలో జన్మించిన నాగేశ్వరరావు జిల్లాస్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు తెలిపాడు. వల్లూరు గ్రామానికి చెందిన సిద్ధాంతపు శ్రీనివాస్ 83 మార్కులతో పీఈటీగా సెలెక్ట్ అయ్యి జిల్లాస్థాయిలో 25వ ర్యాంకు, బీసీ-ఎలో 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వ్యవసాయ కూలీకాగా శ్రీనివాస్ 1 నుంచి 5వరకు వల్లూరు మెయిన్ పాఠశాలలో 6 నుంచి 10వరకు వల్లూరు హైస్కూల్‌లో చదివాడు. పీఈటీ ట్రైనింగ్ గోపన్నపాలెం పశ్చిమగోదావరిజిల్లాలో చదివినట్లుతెలిపాడు.

డీఎస్సీలో బలరామపురం యువకుల ప్రతిభ



పైల శివకుమార్



దడాల దుర్గాప్రసాద్

రౌతులపూడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదలచేసిన ఉపాధ్యాయుల నియామకాల్లో బలరామపురం గ్రామానికి చెందిన పైల శివకుమార్, దడాల దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచారు. పైల శివకుమార్‌కు ఫిజికల్ సైన్స్‌లో రాష్టంలో ఆరో ర్యాంక్ రాగా, జోన్ రెండోస్థానంలో నిలిచాడు. డీజీటీ సైన్స్‌లో రాష్టంలో ఐదో స్థానం, జోన్ మొదటి స్థానంలో, టీజీటీ ఫిజికల్ సైన్స్ జోన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇప్పటికే సెంట్రల్లో రాస్టిరియా మిలటరీలో ఉద్యోగం సాధించాడు. దండాల దుర్గాప్రసాద్ టీజీటీ హిందీర్యాంక్ 8 సాధించాడు.

డీఎస్సీలో గాయత్రికి జిల్లాలో 3వ ర్యాంకు



తోలేటి గాయత్రి

సీతానగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా సీతానగరం మండలంలోని లంకూరుకు చెందిన తోలేటి గాయత్రి ఏపీ మెగా డీఎస్సీలో సెకండ్‌గ్రేడ్ టీచర్ పోస్టుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. గాయత్రి జీవనపోరాటంలో అనేక కష్టాలను అధిగమించారు. రైతు కుటుంబానికి చెందిన గాయత్రి 2003లో పదో తరగతి పూర్తిచేసి తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విద్య ఆగిపోయి వివాహం చేసుకున్నారు. 2012లో భర్తను కోల్పోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. తనలోని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మళ్లీ చదువు ప్రారంభించారు. తన చిన్ననాటి కల అయిన టీచర్ అవ్వాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ ఇంటర్ పూర్తిచేశారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును విజయవంతంగా పూర్తిచేశారు. ఎటువంటి కోచింగ్ సెంటర్ సహాయం లేకుండా స్వయం కృషితో డీ ఎస్సీలో 93.5శాతం మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. తన విజయానికి ప్రేరణ ఇచ్చిన తాతయ్య చేకూరి అరవాలురాజు, తల్లిదండ్రులు తోలేటి సూర్యనారాయణ, నాగమణి ఇద్దరు సోదరులు ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీలో వీరవేణికి 19వ ర్యాంక్



ఉందుర్తి వీరవేణి

కరప, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరప గ్రామంలో నివాసముంటున్న ఉందుర్తి వీరవేణి డీఎస్సీ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా స్థాయిలో 19వ ర్యాంక్ సాధించారు. అంబే ద్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఈమె బీఎస్సీ (సీబీజడ్) చదివి ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఎఫ్ఎన్‌వోగా పనిచేస్తున్నారు. గత నాలుగేళ్లగా ఆమె కరపలో ఉంటూ ఒకపక్క ఉద్యోగం చేస్తూ మరోపక్క డీఎస్సీకి నిర్విరామంగా చదివి రెండో ప్రయత్నంలో ఓపెన్ కేటగిరీలో ఈర్యాంక్ సాధించారు. బయోలాజికల్ సైన్స్ విభాగంలో స్కూల్‌అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె భర్త భరత్‌కుమార్ పాత్రికేయుడిగా పనిచేస్తుండగా, కుమారుడు డిప్లొమో, కుమార్తె ఇంటర్‌చదువుతున్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ)/రాజానగరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఎస్సీ మహిళలకు, పురుషలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో జిల్లాకు ఐదుగురు పురుషలకు, ఐదుగురు స్త్రీలకు, మొత్తం 30 మందికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (హెచ్ఎంవీ) ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. వయస్సు 20 సంవత్సరాల పైబడిన, ఆసక్తిగల షెడ్యూల్డు కులాలు అభ్యర్థులు, కనీసం ఒక స1ంవత్సరం కాలపరిమితిగల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్ఎంవీ) లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు, స్త్రీలు ఈనెల 27న సాయంత్రం ఐదు గంటలలోపు కాకినాడ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఈడీ తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కె.నందేశ్ సెల్ నెం.7671949476 సంప్రదించాలని తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, దర్శనం కోసం బారులుతీరిన భక్తజనం

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.60.16 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొ క్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కా నుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.60.16లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తొలితిరుపతికి భక్తుల రద్దీ



శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,33,380, అన్నదాన విరాళాలు రూ.64,368 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.1800, ప్రసాద విక్రయం ద్వారా 15,990, తులాభారం ద్వారా రూ.50, కానుకలద్వారా రూ.111 వెరసి రూ. 2,15,699 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు ఐదువేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

శివాంజనేయ నర్సరీని సందర్శించిన

హైకోర్టు జడ్జి కిరణ్మయి

కడియం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కిరణ్మయి శనివారం కడియపులంక మల్లు పోలరాజు-శివాంజనేయ నర్సరీని సందర్శించారు. ఆమెకు నర్సరీ రైతు పోలరాజు మొక్కను అందజేసి స్వాగతించారు. కిరణ్మయి నర్సరీలో వివిధ రకాల మొక్కలు చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడియం నర్సరీల గురించి తాను విన్నానని, ఇక్కడ ఎయిర్ ప్యూరిఫైర్, ఆర్కిడ్స్ తదితర ఎటువంటి మొక్కలైనా అందుబాటులో ఉంటాయని, తమకు కావాల్సిన కొన్నిరకాల మొక్కలు కొనుగోలు చేసేందుకు వచ్చామని తెలిపారు. మట్టి లేకుండా గాలిలో తేమను మాత్రమే తీసుకుని పూలను వికసిస్తున్న మొక్కలు తనను ఆకర్షించాయన్నారు. 20నుంచి 40 ఏళ్లనాటి విదేశీ బొన్సాయ్ మొక్కలు పదుల సంఖ్యలో ఉండడం విశేష మన్నారు. కార్యక్రమంలో నర్సరీ రైతు మల్లు శివ, తదితరులు ఉన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జస్టిస్ కిరణ్మయి

ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్‌కు

రూ.88 కోట్లతో డీపీఆర్ సిద్ధం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రూ.88 కోట్ల డీపీఆర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి అందజేస్తున్న టూరిజం అధికారులు

బిక్కవోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వర, శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలతోపాటు గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాలను ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో అభివృద్ధి చేసేందుకు రూ.88 కోట్లతో టూరిజం శాఖాధికారులు డీపీఆర్ సిద్ధం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం టూరిజం శాఖ అధికారులు ఎమ్మెల్యేను కలసి ఈ మూడు ఆలయాలను కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గంజేంద్రసింగ్ షెకావత్ ఆదేశాలతో రాష్ట్ర పర్యాటకశాఖ రూపొందించినట్లు టూరిజం ఈఈ విజయభాస్కరరెడ్డి, కన్సల్టెంట్ పావని, వినోద్ వివరించి డీపీఆర్‌ను అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే ఈమూడు ఆలయాలను అభివృద్ధి చేయడం కోసం డీపీఆర్‌ను పరిశీలించి దానిలో మార్పులు, చేర్పులు చేసి రాష్ట్ర టూరిజంశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదిక అందిస్తామని తెలిపారు.

- తేరుకుంటున్న గ్రామాలు
- కోనసీమ జిల్లాలో 4527 మంది నిరాశ్రయులు
- కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రకటన

నిలకడగా గోదావరి వరద


అమలాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి శాంతిస్తుంది. శనివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ దగ్గర ఉదయం రెండో ప్రమాద హెచ్చరికను, రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసహరించుకుంటున్నట్టు ఇరిగేషన్ అధికారి ప్రకటించారు. దాంతో 9.85 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో పలు కాజ్‌వేలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. పలు లంక గ్రామాలకు వరద ఉధృతి వల్ల రవాణా సౌకర్యాలు స్తంభించి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాకలిపాలెం, మూలస్థానం, అప్పనపల్లి, ఎదురుబిడియం కాజ్‌వేలలో శనివారం రాత్రికి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి జిల్లాలో కాజ్‌వేలతో పాటు లంక గ్రామాలు వరద నీటి నుంచి బయట పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో జరిగిన పంటలు, ఇతర నష్టాలపై అధికారులు ప్రత్యేక బృందాలతో అంచనాలు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు.

7 పునరావస కేంద్రాల ఏర్పాటు

గోదావరి వరదల కారణంగా కోనసీమ జిల్లాలో 1291 కుటుంబాల వారు ముంపు బారిన పడి 4527 మంది నిరాశ్రయులయ్యారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించారు. ఇప్పటివరకూ 3 కుటుంబాల్లో 10 మందిని సురక్షిత కేంద్రాలకు తరలించామని, బాధితుల కోసం 7 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1098 గృహాలు ముంపు బారిన పడాయి. బాధితుల తరలింపునకు 23 బోట్లు సిద్ధం చేసి 283 మందికి సహాయక చర్యలు చేపట్టాం. 400 ఆహార పొట్లాలు 810 టిన్నెలు వాటర్ సప్లై చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బోడసుకుర్రు పల్లిపాలెం, లంక ఆఫ్ ఠాణేలంక, పాశర్లపూడి లంక, చింతపల్లిలంక, కూనలంక, గుర్రుజాపులంక, లక్ష్మీదేవిలంక, గోడిలంక, కొండుకుదురు గ్రామాలు ముంపు బారిన పడినట్టు చెప్పారు.



ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద వరద ప్రవాహం







పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున జలదిగ్బంధంలో అరటితోట, మామిడికుదురు మండలం పాశర్లపూడి శ్రీరామ్‌పేటలో వరదనీరు, కోటిపల్లి పుష్కరాల రేవులో తగ్గిన గోదావరి వరద ప్రవాహం



పి.గన్నవరం: గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదిపాయలో పడవ ప్రయాణం

శాంతించిన శబరి



చింతూరు – కుయుగూరు నడుమ జాతీయ రహదారిపై ప్రారంభమైన రాకపోకలు

చింతూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరురోజుల పాటు ఉధృతంగా ప్రవహించిన శబరి నది శనివారం ఉదయం నుంచి తగ్గడం ప్రారంభించింది. దీంతో లోతట్టు వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిస్సాకు వెళ్లే 30వ నంబరు జాతీయ రహదారిపై వరద నీరు తగ్గడంతో రాకపోకలు పునరావృతమయ్యాయి. కాగా సోకిలేరు వాగుపై ఇంకా వరద నీరు ఉండడంతో చింతూరు - వరరామచంద్రపురం నడుమ శనివారం కూడా రాకపోకలు సాగడం లేదు.

ధవళేశ్వరంలో వరద ఉధృతి తగ్గుముఖం

- ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ
- వేగంగా తగ్గుతున్న నీటి మట్టం

ధవళేశ్వరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి 14.30 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం శుక్రవారం సాయంత్రం నుంచి తగ్గుతూ శనివారం తెల్లవారుజామున 2గంటలకు 13.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. ఆపై వేగంగా తగ్గుతున్న నీటి మట్టం 17గంటల వ్యవధిలో శనివారం రాత్రి 7గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10,04,000వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. రాత్రి 8గంటలకు నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకోగా 9,57,297 క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఎగువన అన్నిప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుతోంది. భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటి మట్టం శనివారం రాత్రి 8గంటలకు 36 అడుగులకు చేరుకుంది.



కాటన్ బ్యారేజ్ దిగువున వరద ప్రవాహం

లారీ ఢీకొని సర్పంచ్ మృతి

రామన్నపాలెంలో విషాదఛాయలు





సర్పంచ్ బుల్లారావు (ఫైల్), ప్రమాదానికి కారణమైన లారీ

దేవరపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొనడంతో ఓ గ్రామ సర్పంచ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామ సర్పంచ్ కూచిపూడి బుల్లారావు (71) శనివారం దేవరపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లడానికి వస్తుండగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన టిప్పర్ లారీ దుద్దుకూరు మెటల్ కోసం వెళ్తోంది. ఈ క్రమంలో దేవరపల్లి పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొని సుమారు 20గజాల దూరం ఈడ్చుకుని వెళ్లిపోయింది. దీంతో బుల్లారావు ముఖభాగమంతా నుజ్జునుజ్జుఅయ్యింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుల్లారావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కూచిపూడి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శవపంచనామా అనంతరం స్వగ్రామం రామన్నపాలెం తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.బుల్లారావు పార్థివదేహానికి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎంపీపీ కేవీకే దుర్గారావు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అయితే లారీకి ముందు భాగంలో సగభాగం అద్దానికి స్టిక్కర్లు, బొమ్మలతో అలంకరించడంతో ఎవరు వెళ్తున్నది సరిగా కనిపించకుండా ఉండే విధంగా ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఠాణేలంక మొల్లిలో చోరీ

- ఇంట్లో వెండి, బంగారం వస్తువులు మాయం

ముమ్మిడివరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ ఠాణేలంక మొల్లిలో ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారం వస్తువులను చోరీ చేశారు. ఠాణేలంక మొల్లికి చెందిన సానబోయిన వెంకటసత్యనారాయణ గురువారం కుటుంబసభ్యులతో కలిసి కర్ణాటక తీర్థయాత్రలకు వెళ్లాడు. అయితే ఇంటికి పాలు తీసుకుని వచ్చే వ్యక్తి శుక్రవారం యథావిధిగా పాలు తీసుకొచ్చి ఇంటి వద్ద పెట్టి వెళ్లిపోయాడు. శనివారం కూడా పాలు తీసుకొచ్చి పెట్టగా ముందురోజున పెట్టిన పాలు అలాగే ఉండడంతో ఇంట్లోకి చూడగా తలుపులు పెకిలించి ఉండడాన్ని గమనించాడు. వెంటనే విషయాన్ని సత్యనారాయణకు ఫోన్‌లో తెలుపగా తాను తీర్థ యాత్రలకు వెళ్లానని చెప్పడంతో ఆ విషయాన్ని బంధువులకు తెలపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో బీరువాలో భద్రపరిచిన 49 తులాల వెండి, నాలుగు బంగారపు రూపులు, రూ.2వేల నగదును దొంగిలించుకుపోయినట్టు సమాచారం. దుండగులు తలుపులు పెకిలించి ఇంటి బీరువాను బద్దలు గొట్టి వస్తువులు, నగదు దొంగిలింకుపోయారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం బృందం అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు.



బీరువాలో చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

రాచపల్లిలో మహాకుంభాభిషేకం



నాయినార్ల విగ్రహాలకు అభిషేక జలాలు తీసుకొస్తున్న దృశ్యం



నాయినార్లకు పల్లకీ సేవ

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో శనివారం నాయినార్ల మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వరుని ఆలయ ప్రాంగణంలో 63మంది నాయినార్ల విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అభిషేకాలు చేపట్టారు. విగ్రహాలకు ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వామి, నాయినార్ల చరిత్ర కారిణి అరుణాచల మాధవి ఆధ్వర్యంలో మహామండలాభిషేకాలు నిర్వహించారు. 63 మంది నాయినార్లతో పాటు దక్షిణామూర్తి, శ్రీ లక్ష్మీ హైయిగ్రీవ సూర్యభగవాన్, కాళభైరవ, భరతమాత, గంగామాతలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తమిళనాడు నుంచి విచ్చేసిన వాయిద్య విద్యాంసుల మంగళవాయిద్యాల మధ్య 63 మంది నాయినార్లకు పల్లకీ సేవ నిర్వహించారు.



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

వీఆర్వో ఆకస్మిక మృతి



అనోజ్‌కుమార్ (ఫైల్)

కూనవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూన వరం మండలం మర్రిగూడెం పంచాయతీకి చెందిన వీఆర్వో పి. అనోజ్‌కుమార్ ఆకస్మికంగా మృతి చెందారు. అనోజ్‌కుమార్ కూనవరానికి గోదావరి అవతలి ఒడ్డున ఉన్న ఏలూరు జిల్లా వేలేరుపాడు నుంచి విధులకు రాకపోకలు సాగిస్తూ ఉండేవారు. 2 రోజులుగా గోదావరి వరద ఉధృతం కావడంతో పడక రాక పో కలు నిలిచిపోయాలు. దీంతో అనోజ్ కుమార్ చూచురేవుల సచివాలయం కార్యాలయంలో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగానే నిద్రపోయేవారు. అయితే శనివారం ఉదయం సచివాలయం సిబ్బంది కార్యాలయానికి వెళ్లి చూడగా అనోజ్ కుమార్ పడిపోయి ఉన్నారు. దీంతో సచివాలయ సిబ్బంది కోతులగుట్ట ఆసుపత్రికి ఆటోలో తరలించగా అనోజ్‌కుమార్ మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. వీఆర్వో 2 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్టు తెలిసింది. ఫిట్స్ కారణంగా మృతి చెందిఉంటాడని డాక్టర్లు చెప్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు



రవాణాశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఈవో



సత్యదేవుడి దర్శనానంతరం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత

అన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం పలువురు ప్రముఖులు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిలో రవాణాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి, చిల్లకూరు సుమలత కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కేవిపి బాపన్న రూ.1,00,116 విరాళం ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన దాతను అభినందించారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం దేవస్థానంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నక్షత్రవనం, సత్యగిరి ప్రాంగణాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ గుర్రాజు, యనమల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా అన్నవరంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో సుబ్బారావు

లారీ ఢీకొని ఆర్ఎంపీ మృతి

పశ్చిమగోనగూడెం వద్ద ఘటన

కోరుకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఆర్ఎంపీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు యేగి ప్రేమ్‌కుమార్(44) మోటార్‌సైకిల్‌పై కోరుకొండ బయలుదేరాడు. మార్గమధ్యంలో కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం సింహపురి లే అవుట్ వద్దకు వచ్చేసరికి ఓ లారీ అతి వేగంగా వచ్చి ప్రేమ్‌కుమార్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా పూర్తి చేశారు.

బైక్ ఢీకొని లారీ క్లీనర్ మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన క్లీనర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నవరం వైపు నుంచి రాజమండ్రి వెళ్తున్న లారీ శుక్రవారం రాత్రి స్థానిక ధర్మవరం హైవేపై ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నిలిపి క్లీనర్ పఠానీ సుభాన హైవే రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన మోటార్ బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుభానును స్థానిక ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది గుంటూరు జిల్లా తెనాలి మండలం కాతేవరం గ్రామంగా పోలీసులు గుర్తించారు. శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.



ముమ్మిడివరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే ఆనందరావు

ముమ్మిడివరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా బహిరంగ ప్రదేశాలు, ఇంటి ఆవరణలో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రుతుపవనాలు-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీలోని బళ్లగేటు సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం జరిపి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మురుగునీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో టీపీవో బి.రాజేష్‌కుమార్, ఆర్‌ఐ వి.భాస్కరరావు, రామకృష్ణప్రసాద్, జి.సూర్య సునీత, కె.రవిశంకర్, కె.లక్ష్మీనారాయణ, సచివాలయ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వో బి. అప్పారావు అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో శుభ్రత తప్పనిసరి

అమలాపురం టౌన్, (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్సూన్ హైజీన్ నినాదంతో అమలాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి నుంచి ఎర్రవంతెన వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే తొలుత పారిశుధ్య కార్మికులను సత్కరించారు. పట్టణ ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ వి.నిర్మలకుమార్, చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమలాపురంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు

పైప్‌లైన్ పునర్నిర్మాణం చేపట్టకపోతే ఉద్యమం

ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ గోదావరిలో వేసిన గ్యాస్ పైప్‌లైన్ పునర్నిర్మాణం చేపట్టకపోతే ఉద్యమం చేపడతామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హెచ్చరించారు. మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఎనిమిది గ్రామాల మత్స్యకారులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. భైరవపాలెం వద్ద శుక్రవారం వేకువజామున ఓఎన్జీసీ పైప్‌లైన్ లీకై మంటలు వ్యాపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారన్నారు. వరద సమయం కావడంతో ప్రాణ నష్టం జరగలేదన్నారు. గోదావరిలో గ్యాస్‌తో పాటు ఆయిల్ లీకవడంతో మత్స్య సంపద దెబ్బతిని మత్స్యకారులకు నష్టం వాటిల్లిందన్నారు. గతంలో ఇదే పైప్‌లైన్ రెండుసార్లు లీకైనప్పటికీ సంస్థ చర్యలు చేపట్టలేదని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తెచ్చి లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భైరవపాలెం, గాడిమొగ, పెద్దవలసల, చిన్నవలసల, లక్ష్మీపతిపురం, చిన్నబొడ్డువెంకటయ్యపాలెం, బలుసుతిప్ప గ్రామాల మత్స్యకారులను ఓఎన్జీసీ ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సాగిరాజు సూరిబాబురాజు, సంగాని వెంకటేష్, అర్దాని శ్రీనివాసరావు, పెసింగి ధర్మారావు, రేకాడి కాళహస్తి, సొర అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అంబాజీపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి డి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో రోడ్డు, ఫుడ్‌సేఫ్టీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో శ్రీనివాస్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా అధికారి ఎం.ఉదయ భాస్కర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎస్‌ఐ చిరంజీవి, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, డీసీపీసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, బొప్పా ప్రతాప్, ఎ.అమరేశ్వరరావు, ఎం.శ్రీనివాస నగేష్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, నక్కా భాస్కర్, ఎన్ఎస్ఎన్ వర్మ, పొలమూరి వెంకట్, వీరా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గుముఖం పట్టాక పనులు ప్రారంభం

మలికిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌లో భాగంగా చేపట్టిన రైల్వే వంతెనలో ఒక పిల్లర్ రెండు నెలల కిందట గోదావరిలోకి ఒరిగింది. ఈ పిల్లర్‌ను సరిచేసేందుకు ముంబై కంపెనీకి కాంట్రాక్టు ఖరారైనట్టు తెలిసింది. ఈ వారంలో పనులు ప్రారంభం కావాల్సి ఉండగా వరద వల్ల వాయిదా పడింది. వరద తగ్గిన తరువాత పనులు ప్రారంభం కానున్నట్టు కాంట్రాక్టు వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు పిల్లర్ పరిస్థితిని అధ్యయనం చేశారు. వంతెన నిర్మాణంలో ఆఖరు పిల్లరు లూజు సాయిల్ వల్ల అది భూగర్భంలోకి వెళ్లే సమయంలో ఒరిగింది. దీంతో స్థానిక కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు రైల్వే ఉన్నతాధికారులకు నివేదించారు. రైల్వే ఉన్నతాధికారుల సూచనల మేరకు డిజైన్ చేసి పిల్లర్‌ను సరిచేసి యథాస్థానంలో ఉండేలా నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

చలో విజయవాడను జయప్రదం చేయండి

కాట్రేనికోన, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. పల్లంకుర్రు భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం శనివారం గంజా సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించలేదని సమావేశంలో నాయకులు అన్నారు. సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జి.దుర్గాప్రసాద్, విత్తనాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సభకు సీపీఐ నాయకులు

మలికిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు మలికిపురం నుంచి సీపీఐ నాయకులు బస్సులో బయలుదేరారు. బస్సు యాత్రకు సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. రాజోలు, రావులపాలెం, విజయవాడ మీదుగా ఒంగోలు చేరనున్నట్టు తెలిపారు.

ఇందిరకు సిల్వర్ మెడల్

ఉప్పలగుప్తం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడోత్సవాల్లో గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినికి సిల్వర్ మెడల్ లభించింది. 75 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జోన్-2 నుంచి యనమదల ఇందిర సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నెల 24, 25, 26 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ తెలిపారు. హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఆధార్ సెంటర్ కావాలి..

ఉప్పలగుప్తం, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు అగచాట్లు పడుతున్నారు. ఆధార్ సమస్యలు పరిష్కారానికి కాట్రేనికోన మండలం లేదా ముమ్మిడివరం మండలాలకు వెళ్ళవలసి వస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏదో ఒక సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి సమీప ప్రజల అవసరాలను తీర్చేవారు. మండలంలో ప్రైవేటు ఆధార్ కేంద్రాలు ఉండేవి. సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో లబ్ధిదారులు ప్రైవేటు కేంద్రాలకు వెళ్ళడం తగ్గించుకున్నారు. వారం రోజులుగా పలువురు ఎంపీఈవో కార్యాలయానికి వచ్చి ఆధార్ కేంద్రాల కోసం ఫిర్యాదు చేస్తున్నారు. ప్రస్తుతం ఆధార్‌కు సంబంధించి శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్స్ సచివాలయాల్లో లేరని ఎంపీడీవో భూపతిరాజు తులసీకృష్ణ తెలిపారు. త్వరలో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పి.గన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్లో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీము ఎయిడ్స్‌పై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 9, 10వ తరగతి విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పీవీవీ లక్ష్మీదేవి, సంస్థ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది ఏసుకుమారి పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కాట్రేనికోన, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చీకురుమెల్లివారిపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇసుకపట్ల వెంకటరమణకు చెందిన తాటాకిల్లు బూడిదయ్యింది. వంటగ్యాస్ సిలిండర్ పేలడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో రూ. 3లక్షల నగదు, గృహ సామగ్రి బూడిద అయ్యిందన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి కాజ్‌వే వద్ద స్థానికుల కష్టాలు

ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టినప్పటికీ దిగువకు వరదనీరు విడుదల చేయడంతో ఇక్కడ వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఆయా లంక గ్రామాలను వరదనీరు ముంచెత్తుతోంది. జలదిగ్బంధంలో లంక గ్రామాలు చిక్కుకోగా, కొబ్బరితోటలతో పాటు చెరకు, అరటి, తమలపాకు పలు పంటలు ముంపుబారినపడ్డాయి.

పి.గన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో వరద తగ్గుతున్నప్పటికీ దిగువన నదీపాయలు మాత్రం ఇంకా ఉగ్రరూపంతోనే సాగుతున్నాయి. గోదావరిలో వరద తగ్గుముఖం పట్టడంతో ఆయా లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి నదీపరివాహక ప్రాంతాల్లో ఉన్న కాజ్‌వేలు మాత్రం ఇంకా వరద ముంపు నుంచి తేరుకోలేదు. పి.గన్నవరం మండల పరిధిలోని కె.ఏనుగుపల్లిపైకి వరద నీరు చేరడంతో స్థానికులు ముంపులో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై మాత్రం వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది. దీంతో అధికారులు ఏర్పాటు చేసిన పడవలపై స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి, ఉడిమూడి లంక పరిధిలోని నాలుగు లంక గ్రామాల ప్రజలు ఏటిగట్టు దిగువున ఉన్న కాజ్‌వేను దాటుకుని బూరుగులంక నదిపాయపై పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివాయిలంక గ్రామానికి వెళ్లే రహదారి నీట మునగడంతో రెండు పడవలను ఏర్పాటు చేసినప్పటికి మధ్యాహ్నం సమయంలో వరద కాస్త తగ్గడంతో పడవలు తిరిగే పరిస్థితి లేదు. దీంతో లంక గ్రామస్తుల రాకపోకలకు అధికారులు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. ఉడిమూడి ఏటిగట్టు దిగువన ఉంటున్న సంచారజాతుల పూరిపాకలు నీటమునగడంతో సమీపంలో ఉన్న ఏటిగట్టుపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.

నాలుగు పడవలు తిరుగుతున్నాయి

తహశీల్దార్ శ్రీపల్లవి

గంటిపెదపూడి, బూరుగులంక నదీపాయ వద్ద రెండు, ఉడిమూడి, బెల్లంపూడి నదిపాయల వద్ద ఒక్కొక్క పడవను ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ఉడిమూడిలో ఉన్న సంచార జాతులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేశామన్నారు. లంక గ్రామాల్లో వైద్య శిబిరాలు నడుస్తున్నాయని తెలిపారు. ఉద్యాన పంటలు 388 హెక్టార్లలో నీటమునిగాయని తహశీల్దార్ తెలిపారు.

ముంపులోనే లంక గ్రామాలు

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన వరద ఉధృతి తగ్గినా దిగువన మండలంలోని లంక గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. అమావాస్య కావడం..సముద్రం పోటెత్తి ఉండడంతో వరద నీరు నెమ్మదిగా సాగుతోంది. మండలంలోని లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంక, లంకాఫ్ గేదెల్లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో ఉన్నాయి. వివేకానంద వారధి, గురజాపులంక సీసీ రోడ్డు గురజాపులంక వద్ద ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంకల్లో లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో ఉన్నాయి. శనివారం కూడా గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంకలోని పాఠశాలలు తెరవలేదు. లంక భూముల్లో సాగు చేసిన బెండ, బీర, మునగ, వంగ, ఆనప వంటి కూరపాదులు ముంపులోనే ఉన్నాయి. లంకాఫ్ గేదెల్లంకలో కూడా ముంపు కొనసాగుతోంది. ఉత్తరవాహిని వద్ద వరదనీరు ప్రవహిస్తోంది. మండల ప్రత్యేకాధికారి బి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, మండలస్థాయి అధికారులు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము కొనసాగుతోంది. లంకాఫ్ గేదెల్లంక, గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంకలలో ఏర్పాటు చేసిన బోట్లలో రైతులు పొలాలు వెళ్లేందుకు రాకపోకలు సాగిస్తున్నారు.

ముంపులో వాణిజ్య పంటలు

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నదీతీర ప్రాంతాల్లోని పలు వాణిజ్య పంటలు వరదనీటిలో చిక్కుకున్నాయి. నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో అరటి, కొబ్బరి, దొండపాదులు నీటిలో మునిగాయి. గోదావరి సమీపంలో ఉన్న కౌశిక పొంగి ప్రవహించడంతో ఆయా కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. తొండవరం రజకపేటకు వెళ్లే రోడ్డు నీట మునగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వరద ముంపులో మత్స్యకారుల ఇళ్లు

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): వైనతేయ గోదావరి వరద నిలకడగా కొనసాగుతోంది. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలో సుమారు 70 మత్స్యకారుల ఇళ్లు జలదిగ్బంధంలో ఉన్నాయి. పంచనది, వాసాలతిప్ప, లోయర్ కౌశిక డ్రెయిన్లు వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. బోడసకుర్రు పల్లిపాలెం ప్రాంతంలో వరద నీటిలో తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు, డీఎల్పీవో వి.బొజ్జిరాజు, ఎంపీడీవో బి.లక్ష్మణరావు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, వీఆర్వో యు.చిట్టిబాబు, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇందిర పడవలపై వరద ప్రాంతంలో పర్యటించారు. అమావాస్య సందర్భంగా ఓడలరేవు, కొమరగిరిపట్నం సాగర తీరంలో అలల ఉధృతి కొనసాగింది.

మామిడికుదురు,(ఆంధ్రజ్యోతి): వరద తగ్గుముఖం పట్టినప్పటికి వరద ఉధృతి కొనసాగుతోంది. అప్పనపల్లి, పెదపట్నంలంక, పెదపట్నం, బి.దొడ్డవరం తదితర గ్రామాలు జలదిగ్బంధలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతంలో ఉన్న గృహాలు వరదనీట మునిగాయి. అప్పనపల్లి స్నానాల రేవు వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లోని అరటి తోటలు రెండు రోజులుగా వరదనీట మునగడంతో అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఆదివారం నాటికి వరద తగ్గే అవకాశం ఉందని లంక గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

నిలకడగా యానాంలో వరద ప్రవాహం

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం నియోజవర్గంలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గౌతమి గోదావరికి వరద నీరు తాకింది. దీంతో రాజీవ్‌గాంధీ బీచ్ నీట మునగటంతో పాటు పలు పర్యాటక కట్టడాలు వరద ముంపునకు గురయ్యాయి. వరద పరిస్థితిపై పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి ముంపు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.



ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలో వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో మామిడికుదురు మండలం అప్పనపల్లి మెల్లేటివారిమెరకలో గృహాలను ముంచెత్తిన వరద



విరాళం అందిస్తున్న ఉపేంద్రరావు దంపతులు

వీరేశ్వరస్వామి ఆలయానికి లక్ష విరాళం

ఐ.పోలవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటకు చెందిన టి.ఉపేందర్‌రావు, శ్రీదేవి దంపతులు మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయానికి లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఇందులో రూ.50వేలు అన్నదాన ట్రస్టుకు, రూ.50వేలు ఆలయం కోసం ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజుకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించి సత్కరించారు. దాతలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అభినందించారు.



రాజమండ్రి జడ్జికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న సిబ్బంది

బాలబాలాజీని దర్శించుకున్న జిల్లా జడ్జి

మామిడికుదురు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 8వ జిల్లా జడ్జి వై.బెన్నయ్యనాయుడు శనివారం అప్పనపల్లి బాలబాలాజీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆయన పేరిట ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దుశ్శాలువాతో సన్మానించి వేదాశీర్వచనం అందించి స్వామి వారి చిత్రపటంతోపాటు ప్రసాదాన్ని అందించారు. ఆయనతో పాటు అమలాపురం టౌన్ సీఐ పి.వీరబాబు, ఆలయ సిబ్బంది బొక్కా సత్యమూర్తి, గుత్తుల శ్రీను, అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు, జె.సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామికి పూజలు: అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే వేద పండితులు స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించి తొలిహారతిని ఘనంగా జరిపారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం రూ.1,18,346 ఆదాయంగా వచ్చిందని స్వామివారిని 1,500 మంది దర్శించుకున్నారని తెలిపారు. అన్నప్రసాదంలో 1000 మంది పాల్గొన్నట్టు సహాయ కమీషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

మాధవ్ పర్యటనను విజయవంతం చేయండి

మలికిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో 25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా అమలాపురంలో జరిగే శోభాయాత్ర, చాయ్‌పే చర్చ సభలో అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. బట్టేలంకలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో రామ్మోహనరావు, చెంపాటి శివరామకృష్ణంరాజు, పాలెపు శ్రీనివాస నగేష్, మేడిచర్ల చాణక్య, పాలూరి సత్యానందం, శృంగారపు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోనసీమ పర్యటనలో భాగంగా 25న అమలాపురంలో జరిగే శోభాయాత్ర ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. బెండమూర్లంకలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, రేకాడి సత్యనారాయణవర్మ, సుంకర సాయి, గూడాల పుల్లయ్యశెట్టి, ఓలేటి పరమేశ్వరరావు, ఎ.దనుంజయవర్మ, కె.దుర్గాప్రసాద్, కంకిపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానుల ఫిర్యాదు

రాజోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్‌టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వేంకటేశ్వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రాజోలుకు చెందిన జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాజోలు, మామిడికుదురుకు చెందిన జూనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘ అధ్యక్షులు యనమదల సీతారామరాజు, ఎన్‌టీఆర్ ఫాన్స్ రాష్ట్ర కన్వీనర్ రాయుడు బాబ్జి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుబాటి, ఎన్‌టీఆర్ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాజోలు సీఐకి ఎమ్మెల్యే దగ్గుబాటిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మామిడిశెట్టి హనుమంతు కుమార్, చెల్లుబోయిన నానీ, పిల్లి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నిరసన

ముమ్మిడివరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ముమ్మిడివరం ఎన్టీఆర్ అభిమానులు ఖండించి నిరసన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవెంకటేశ్వర థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్టీఆర్, కుటుంబ సభ్యులపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు ఖండించారు. కార్యక్రమంలో మల్లాడి హరికృష్ణ, సంగాడి బ్రావో, బూరుగ శ్రీనివాసకల్యాణ్, ఎన్ఎస్ మూర్తి, సతీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెరైన్ పోలీస్ స్టేషన్‌లో అవగాహన సదస్సు

అల్లవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు మెరైన్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అటవీ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో 1093 కాల్ సెంటర్‌కు సంప్రదించడంపై మెరైన్ అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో మెరైన్ ఎస్‌ఐ రమేష్, మల్లాడి ఉమామహేశ్వరరావు, అవనిగడ్డ శేషారావు, బాలయోగి, వీఆర్వో మెట్ల బాబ్జి, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనపై విద్యార్థులు జిజ్ఞాస కలిగి ఉండాలి

మలికిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనపై విద్యార్థులు జిజ్ఞాస కలిగి ఉండాలని వివేకానంద కరస్పాండెంట్ టీవీవీ వరప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23, 2023లో చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా, షార్ట్ ల్యాండింగ్ సాధించిందన్నారు. దీంతో భారతదేశం చంద్రునిపై దిగిన నాల్గో దేశంగా అవతరించిందని అన్నారు. షార్ట్ ల్యాండింగ్ తరువాత ప్రజ్ఞాన్ రోవర్ విజయవంతంగా మోహరింపబడిందని, ల్యాండింగ్ సైట్‌కు శివశక్తి పాయింట్ అని పేరు పెట్టారని, అప్పటి నుంచి ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

మలికిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి నెక్కంటి దిలీప్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎస్ఎన్ ఆనందమహానీ తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11న అమలాపురం బాలయోగి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించి కాకినాడ జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో 65 కిలోల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఛైర్మన్ రుద్రరాజు పద్మరాజు అభినందించారు. కార్యక్రమంలో చిట్టాల సత్యనారాయణ, పీడీకే ప్రసాద్, సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ఐ.పోలవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భీమవరం విష్ణు డెంటల్ కాలేజీ ఆధ్వర్యంలో మురమళ్ళ భైర్రాజు ఫౌండేషన్ వద్ద శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, ఐఎస్సీ అమెరికా సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రారంభించారు. ఐఎస్సీ యూఎస్ఏ చైర్మన్ డాక్టర్ భూపతిరాజు పెండాటి మురమళ్ళను దత్తత తీసుకున్నారు. 190 మందికి దంత పరీక్షలు నిర్వహించారు.



కామనగరువులో స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్లాస్టిక్ అందించు.. సరుకులు అందుకో

జిల్లాలో తొలి స్వచ్ఛంద రథం ప్రారంభం

అమలాపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో తొలి స్వచ్ఛ రథాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్ శనివారం కామనగరువులో ప్రారంభించారు. ప్లాస్టిక్ అందించు..సరుకులు అందుకో నినాదంతో వస్తున్న స్వచ్ఛంద రథాన్ని ప్రజలు వినియోగించుకుని స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంట్లో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను స్వచ్ఛ రథాలకు అందించి నిత్యావసర సరుకులు తీసుకోవచ్చని డీపీవో డి.శాంతలక్ష్మి అన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మూలన ఉన్న ఎండీయూ వాహనాన్ని స్వచ్ఛ రథంగా మార్చి ప్రజల ముందుకు తీసుకువచ్చారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎల్పీవో బొజ్జిరాజు, మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, పి.ఆదినారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో మృతి

అమలాపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం డిప్యూటీ ఎంపీడీవో బి.మంగాదేవి(59) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. శనివారం ఆమె మృతదేహానికి డీపీవో డి.శాంతలక్ష్మి, డీఎల్పీవోలు పి.బొజ్జిరాజు, ఎం.బాలాజీ, కోట అనిత, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, రెడ్డి శిరీష, కోడూరి వెంకటేశ్వరరావు, సింగంశెట్టి శ్రీను, ఎస్.రాజ్ మోహన్, అడబాల రాజా, పి.ఆదినారాయణ, పి.శ్రీను, దారా రామకృష్ణ నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్ షిప్ కోసం కాకినాడ డీఎస్‌ఏ స్టేడియంలో అయిదు జిల్లాలకు చెందిన క్రీడాకారులకు బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జోనల్ స్థాయి అండర్-19 విభాగంలో మలికిపురానికి చెందిన వై.నందకిశోర్ సింగిల్స్ విన్నర్‌గా, కృష్ణకార్తీక్ రన్నర్‌గా నిలిచినట్టు నేషనల్ ఎంపైర్ పాయసం శ్రీనివాసరావు తెలిపారు. డబుల్స్ బాలుర విభాగంలో అమలాపురానికి చెందిన బి.ఆదిత్యారామ్, వై.గౌతమ్‌కుమార్ రన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో ఎం.రమ్య, ఎం.రిత్విక్ రన్నర్స్‌గా నిలిచారు. వీరంతా తిరుపతిలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని శ్రీనివాసరావు తెలిపారు.

రూ. 5కే నాణ్యమైన భోజనం : ఎమ్మెల్యే


ఏడిదరోడ్డులోని అన్న క్యాంటీన్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా రూ. 5 కే నాణ్యమైన భోజనం అందిస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. శనివారం ఏడిదరోడ్డులోని అన్న క్యాంటీన్‌ను స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిలో భాగంగా అక్కడ భోజనం చేస్తున్నవారిని భోజనం ఎలా ఉంది అని అడిగితెలుసుకున్నారు. దానికి వారంతా సమాధానమిస్తూ చాలా బాగుంది అని, తమలాంటి వాళ్లకి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈయనతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మండపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల వినియోగంపై జిల్లా వనరుల కేంద్రం, ప్రధానమంత్రి రాష్ట్రీయకృషీ వికాశ్ యోజన ఆధ్వర్యంలో శనివారం ఏడిదలోని రైతులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా యాజమాన్య పద్ధతులపై రైతులకు ముమ్మిడివరం నుంచి వచ్చిన వ్యవసాయాధికారి జేఏఎన్‌వీవీ మనోహర్ వివరించారు. ప్రస్తుత సీజన్‌లో వరిలో ఎరువుల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. నత్రజని పొటాష్ ఎరువులను రైతులు అవసరం మేరకు వాడాలని ఏవో జే.ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఏడిద సాగునీటిసంఘ అధ్యక్షుడు కోలుపోటి బాబు, సొసైటీ అధ్యక్షుడు ఎర్రబ్బు, పీ.వీర్రాజు వైఎస్ఎంపీపీ పీ.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పీ.శ్రీనివాసరావు, వ్యవసాయవిస్తరణాకారి వనుము బాలకృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం'


రాయవరంలో పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పిరమిడ్ మాస్టర్లను సత్కరిస్తున్న దృశ్యం

రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా ధ్యానం, యోగా సాధన చేయటాన్ని అలవర్చుకోవాలని పెడపర్తికి చెందిన పిరమిడ్ మాస్టర్ రాజ్యలక్ష్మి, యోగా గురువు వెలగల ఫణి కృష్ణారెడ్డి సూచించారు. శనివారం రాయవరం సత్యసాయి సేవామందిరం వద్ద ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన శిక్షకులు రాజ్యలక్ష్మి, సుబ్బారావు పాల్గొని ధ్యాన సాధనపై అవగాహన కల్పించారు. అనంతరం ధ్యాన శిక్షకులు రాజ్యలక్ష్మి, సుబ్బారావును ఫణికృష్ణారెడ్డి సీతాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. రాయవరం పరిసర ప్రాంతాలకు చెందినవారు పాల్గొన్నారు.

వేదాలతో సనాతన ధర్మం సాధ్యం


తాపేశ్వరంలో జరిగిన వేద సభలో పాల్గొన్న వేద పండితులు

మండపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మన దేశంలో పుట్టిన వేదాలను కాపాడుకోవటంతో పాటు వాటిలో పొందుపరిచిన ఆచార వ్యవహారాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు వేదపండితులు అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాపేశ్వరంలోని అగస్తేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం 73వ వేదశాస్త్ర పరిషత్‌సభను నిర్వహించారు. దీనికి రాష్ట్ర నలుమూలల నుంచి వేదపండితులు, ఘనాపాఠీలు హాజరయ్యారు. ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ గుళ్లపల్లి సీతారామచంద్రమూర్తి మాట్లాడుతూ అన్నింటికీ వేదమే మూలమన్నారు. రాళ్లపల్లి సూర్యసుబ్రహ్మణ్య రామభీమేశ్వర శర్మ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రాళ్లపల్లి సూర్యసుబ్రహ్మణ్య శర్మ, పుల్లకవి భాస్కరరావు, ఆర్‌వీఎస్ఎస్ఎస్ శర్మ సారథ్యంలో 300 మంది వేదపండితులు హాజరై వేదపఠనం చేశారు.

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేయాలి

కె.గంగవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో టీచర్లు బోధించాలని ఎంఈవో-1 ఏ.నాగరాజు అన్నారు. శనివారం రావిదొడ్డిపేట పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు.

గోదావరి తగ్గుముఖం

- ఊపిరి పీల్చుకున్న నదీ పరివాహక ప్రాంత ప్రజలు
- పర్యవేక్షిస్తున్న అధికారులు


కేదార్లంకలో తగ్గుముఖం పట్టిన వరదను పరిశీలిస్తున్న వీఆర్వో వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నదీపరీ వాహక ప్రాంతాల ప్రజలను భయాందోళనకు గురిచేసిన గోదావరి వరద శనివారం కాస్త తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ లంక పొలాల్లోని అరటి, కొబ్బరి, కూరగాయ పంటలు ఇంకా ముంపులోనే కొనసాగుతున్నాయి. కోరుమిల్లి లంక, పల్లపులంక, నారాయణలంక పల్లపు ప్రాంతాల్లోని లంకభూముల్లో వరద చేరడంతో పంటలు పనికి రాకుండాపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. లంక గ్రామాల్లో పారిశుధ్యపనులతో పాటు ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కె.గంగవరం: కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతి ఇంకా కొనసాగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదులుతున్న నీటితో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోటిపల్లి పుష్కరాల రేవులో రెండు అడుగుల మేర వరద తగ్గినప్పటికీ పుష్కరాల రేవు, ఫెర్రీ రేవు, స్థానిక మత్స్యకార కాలనీలోని కొన్ని ఇళ్లు ముంపులోనే ఉన్నాయి.

భక్తులతో కిటకిలాడిన వెంకన్న ఆలయాలు

రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిలాడాయి. రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, హారతులు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే


ద్వారపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మండపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీలో శనివారం స్వచ్ఛాంధ్ర... స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాణితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. దీనిలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టీవీ రంగారావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, కౌన్సిలర్లు కాశీన కాశీవిశ్వనాథం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మున్సిపల్, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.

మండపేట రూరల్‌లో... ద్వారపూడిలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఆకులు వీవీ రమణ సారథ్యంలో గ్రామంలో ర్యాలీ జరిగింది. బీజేపీ నేత మురళీకృష్ణ, వైద్య, పంచాయతీ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు వద్దు

కపిలేశ్వరపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రేషన్ పంపిణీ విషయంలో డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ జీ. శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. 65 సం.రాలు దాటిన వృద్ధులకు రేషన్ అందించడంలో డోర్‌డెలివరీపై అనేక ఫిర్యాదులు అందుతున్నా యన్నారు. ఆర్ఐ శ్రీనివాస్, మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవేణి

కపిలేశ్వరపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఇందులో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు పాల్గొని ఆసుపత్రికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆమె వైద్యాధికారులను కోరారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి పలు తీర్మానాలు చేశారు. అచ్యుతాపురం, నల్లూరు గ్రామసర్పంచ్‌లు రెడ్డి సుజాత, కురుపూడి ఉదయశ్రీ, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర ర్యాలీలు


రాయవరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్యఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలనకు పూర్తిస్థాయిలో ప్రజలు సహకరించాలని గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, కార్యదర్శి కే. శివచక్రవర్తి కోరారు. శనివారం కపిలేశ్వరపురంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు శుభ్రం చేయించడం, తడిచెత్త, పొడిచెత్త, సింగిల్‌యూజ్, ప్లాస్టిక్‌పై ప్రజలకు కళాజాత రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మాచర పీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఖండవిల్లి విజయ్‌కుమార్ పాల్గొని విద్యార్థులచే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురంలో ప్లాస్టిక్ నిర్మూలనపై కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న సైన్స్ ప్రయోగాలు


వెంటూరు హైస్కూల్‌లో సైన్స్ ప్రయోగాలు తిలకిస్తున్న విద్యార్థులు

రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. సైన్స్ టీచర్ పి.హరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాకెట్ ప్రయోగంతో పాటు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డి.సత్తిరాజు మాట్లాడుతూ మానవాళి మెరుగైన జీవనం, మానవ మనుగడ సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికా ఆలయంలో చండీ హోమం


చింలూరులో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి హోమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా ఆలయ ఈవో వీర్రాజు చౌదరికి ఇటీవల జిల్లా ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు సత్కరించి ఆలయ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియడారు. కార్యక్రమంలో నాయకులు గన్ని వెంకట్రావు, దొమ్మేటి రామకృష్ణ, వైట్ల గంగరాజు, పెద్దింటి కాశీ, చనుమోలు గణేష్, పెద్దింటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న దర్శనం సులభతరం

ఆలయ ఉత్తర, దక్షిణ ద్వారాలను వెడల్పు చేసిన అధికారులు


వెడల్పు చేసిన ద్వారం గుండా బయటకు వస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం సులభతరమైంది. కొంతకాలం నుంచి రోజురోజుకు భక్తుల తాకిడి పెరిగిపోతోంది. గంటల తరబడి క్యూలైన్లలోనే స్వామివారి దర్శనం కోసం వేచిచూస్తున్నారు. వృద్ధులు, చిన్నారుల సైతం స్వామివారి దర్శనం కోసం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థపతి సూచనలు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆలయ ఉత్తర,దక్షిణ ద్వారాలను వెడల్పు చేశారు. నాలుగు లైన్ల ద్వారా భక్తులను స్వామివారిని దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. భక్తులందరూ సులభంగా స్వామి వారిని దర్శించుకునే విధంగా ఏర్పాటు చేయడంతో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులు త్వరగా స్వామివారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా వీఐపీ, సిఫార్సులతో వచ్చే భక్తులకు స్లాట్ విధానం అమలు చేస్తున్నారు.

కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలి

ఎస్‌బీఐ డీజీఎం దేవిలాల్ మెహ్రా


బీమా చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా కేవైసీలు, రీకేవైసీలు అప్‌డేషన్ చేయించుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం దేవిలాల్ మెహ్రా పేర్కొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి సురక్ష బీమా, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఖాతాదారులకు ఈ పథకాలు రక్షణగా నిలిస్తాయన్నారు. సదస్సులో ఎస్‌బీఐ ప్రతినిధులు పం కజకుమార్, అశోక్ నాగరాజన్, హరీష్‌కుమార్, ఆదినారాయణమూర్తి, కేఆర్‌కేపీ వర్మ, రాజసాహెబ్, వీరభద్రరావు పాల్గొన్నారు.

శనేశ్వరుడి పూజలు

కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.3,65,750 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ఆలమూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని అధికారులు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజుల అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక విగ్రహాలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, ముందుగా అనుమతి కోసం రెవెన్యూ, పోలీస్ శాఖలకు దరఖాస్తులు అందించాలన్నారు. విద్యుత్ లైట్లు ఏర్పాట్లపై విద్యుత్‌శాఖ అనుమతి పొందాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ దుర్గాప్రసాద్, ఏఎస్ఐ సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

20 ట్రావెల్ బస్సులపై కేసులు



రావులపాలెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జాతీయ రహదారిపై జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రికార్డులు సక్రమంగా లేని 20 ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.54,200 ఫైన్లు విధించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం హానికరం

- డీఎల్‌డీవో రాజేశ్వరరావు
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు


రావులపాలెంలో పారిశుధ్య కార్మికులను సత్కరించిన ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం ఎంతో హానికరమని, ఆరోగ్యంపై తీవ్రప్రమాదం చూపుతుందని డీఎల్‌డీవో టీఆర్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ర్యాలి గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం సర్పంచ్ కొడమంచిలి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన పెంచి పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని జడ్పీటీసీ బోనం సాయిబాబా పేర్కొన్నారు. పలు దుకాణాల వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అంకంపాలెంలో స్వమిత్వ సర్వేను డీఎల్‌డీవో పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో చిన్నబ్బులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురంలో ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఒకేషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆటోమొబైల్ లాబరేటరీ, ఎలక్ట్రానిక్స్ లాబరేటరీలను చైర్‌పర్సన్ శ్రీదేవి, వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శ్రీకాంత్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వుండవిల్లి శివ, గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కడియాల రాఘవన్, కవల నానాజీ, కంచుమర్తి బాబూరావు, దంగేటి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట పంచాయతీ పరిధిలో సర్పంచ్ బూసి జయలక్ష్మి ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. అలాగే స్థానిక విద్యాబాలమందిర్‌లో విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బూసి భాస్కరరావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ ఆర్.అనురాధ, నూకపెయ్యి శివరత్నం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మ్మెల్యే బండారు దోమల నివారణకు ఆయిల్‌బాల్స్‌ను డ్రైన్‌లో వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెలు పరిశుభ్రంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వ్యర్థాలను రహదారులపై వేయకుండా పారిశుధ్య వాహనాల్లో వేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, కేవీ సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, గుత్తుల పట్టాభిరామారావు, కొప్పిశెట్టి ప్రసాద్, జక్కంపూడి వెంకటస్వామి, ఎంపీడీవో మహేశ్వరరావు, డీఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలిలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిలకడగా గోదావరి వరద


జొన్నాడ వద్ద వరద నీటిలో పుష్కర్‌ఘాట్

ఆలమూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ఆలమూరు మండలంలో శనివారం వరద గోదావరి నిలకడగా కొనసాగుతోంది. గోదావరి లంక భూముల్లో సాగుచేస్తున్న వాణిజ్య రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మండలంలోని బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరులోని లంక భూములు, లోతట్టు ప్రాంతాల్లోని భూముల్లో సాగుచేస్తున్న వాణిజ్య పంటలు ఇప్పటికే ముంపునకు గురయ్యాయి. అయితే మెరకలలో ఉన్న వాణిజ్యపంటలు సాగుచేస్తున్న రైతులు మాత్రం వరద గోదావరి కొంత శాంతించడంతో ఊరట చెందుతున్నారు. మూలస్థానం వద్ద వరదనీటిలో కొట్టుకుపోయిన కాజ్‌వే వరద ఉధృతి అలానే కొనసాగుతోంది. రావులపాలెం మండలం తోకలంకకు వరద చేరుకుని ప్రజలు జలదిగ్బంధంలోనే ఉన్నారు. జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్, ఆలయాలు ముంపునీటిలోనే ఉన్నాయి.

సందీప్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడికి డాక్టరేట్

కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సందీప్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బండారు పెద్దవెర్రియ్య(చిట్టిబాబు)కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. సందీప్ ఐ క్లీనిక్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందించారని, ఈ మేరకు చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శనివారం యూనివర్శిటీ ప్రతినిధులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారన్నారు. డాక్టరేట్ పొందిన చిట్టిబాబును పలువురు అభినందించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు


మధ్యాహ్న భోజన తనిఖీలో ఎంపీడీవో రాజు

ఆలమూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ లేకుండా రుచికరమైన ఆహారం అందించాలని ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. నాణ్యతపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, నాణ్యతలో తేడా వస్తే ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. తనిఖీలో ఎంఈవో బి.అప్పాజీ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, వాసంశెట్టి సత్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్లు అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. శనివారం రామచంద్రపురంలో అన్నక్యాంటీన్‌ను ఆమెతోపాటు సత్యం వాసంశెట్టి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వాసంశెట్టి సత్యం తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి పరిశీలించారు. పరిసరాల శుభ్రత, భోజనం నాణ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ శ్రీకాంత్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.